ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

5

శుక్రవారం 5 ఏప్రిల్ 2024

ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (శుక్ర)
సహరి : 4:33 (శని)

కూటమి వ్యూహాత్మకం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ షోలో చంద్రబాబు



ఆటంకాలను అధిగమించి.. ఉమ్మడిగా ప్రచారం

- ఆత్మీయ కలయికలతో మరింత బంధం
- వైసీపీలో కలహాల కాపురాలు
- గోదావరి వైపు పార్టీల అధినేతల చూపు
- నేడు టీడీపీ అధినేత చంద్రబాబు రాక
- పాలకొల్లు, నరసాపురంలో సభలకు హాజరు
- వైసీపీ నుంచి కూటమి వైపు వలసలు

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో ఉమ్మడి కూటమి కుదురుకుంది. ముందస్తు ఆటంకాలను పూర్తిగా అధిగమించింది. పరస్పర సమన్వయంతో అభ్యర్థులు ప్రచారంలోకి ముందున్నారు. నియోజకవర్గాల వారీగా ఆత్మీయ కలయికలు ఉమ్మడి కూటమికి బాగా కలిసి వచ్చింది. పోలింగ్ గడువు సమీపిస్తున్న తరుణంలో గ్రామ గ్రామాన నిలదొక్కుకోవడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనికితోడు పార్టీల అధినేతలు గోదావరి జిల్లా వైపు దూసుకువస్తున్నారు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కూటమి ఇప్పటికే ఉమ్మడి వ్యూహాలకు దిగింది. కలిసి కట్టుగా ప్రచారం చేస్తూనే వ్యూహాలు రూపొందించి అమల్లోనూ జాగ్రత్త పడుతున్నారు. ఈ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలను దక్కించుకోవాలన్న లక్ష్యంలో భాగంగానే వడివడిగా అడుగులు వేస్తున్నారు. కీలక నియోజకవర్గాల్లో పార్టీ ఎన్నికల రణభేరి మోగించటం, వాటికి అనుగుణంగా అధినేతలను రప్పించడం కేడర్‌లో మరింత ఉత్సాహం నూరిపోయడం వంటివి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నాయి. చంద్రబాబు పర్యటనలోనూ భారీ ఎత్తున జనం హాజరయ్యేలా జాగ్రత్త పడుతున్నారు. వాస్తవానికి అధికార వైసీపీకి తీవ్ర వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించడం, లోతట్టు గ్రామాల్లోను ఈ తరహా ఛాయలు కనిపిస్తుండడం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థులకు మనో ధైర్యాన్ని ఇచ్చింది. తగ్గట్టుగానే గడప గడపకు వెళ్ళి ఓటర్లను కలుస్తున్నారు. ఓ వైపు ఎన్నికల నియమావళిని పాటిస్తూనే ఎక్కడా ఉల్లంఘనలకు తావు లేకుండా ప్రచార ఒరవడిని ఉధృతం చేశారు. శుక్రవారం జరగనున్న చంద్రబాబు ఎన్నికల ప్రచారం అనంతరం మరింత ఊపు పెరుగుతుందని ఆ పార్టీ వర్గాలు ధీమాతో ఉన్నాయి. కేవలం అభిమానులతోనే ఎన్నికల సభకు హాజరయ్యేలా అందరికి పిలుపునిచ్చారే తప్ప వైసీపీ సభల మాదిరిగా తరలింపునకు దిగడం లేదు. మహిళలు, రైతులు, యువకులు పెద్ద ఎత్తున ఎవరంతట వారే ఏర్పాట్లు చేసుకుని చంద్రబాబు సభకు తరలి రావడానికి ఇప్పటికే సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వం పై వాగ్బాణాలు సంధిస్తూ వచ్చిన చంద్రబాబు పనిలో పనిగా స్థానిక వైసీపీ నాయకత్వంపైన విరుచుకుపడుతూనే ఉన్నారు. ఇంకోవైపు జనసేన పవన్ కల్యాణ్ సైతం త్వరలోనే పశ్చిమ పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, సమాంతరంగా జగన్ బస్సుయాత్ర త్వరలోనే ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు రానున్నాయి. వచ్చే రెండు వారాలు అధినేతల పర్యటనలతో దద్దరిల్లబోతున్నాయి.

కలిసొచ్చిన ఆత్మీయ కలయికలు

మూడు పార్టీలు ఉమ్మడిగా ఎన్నికల బరిలోకి దిగాయో అప్పటి నుంచే అధికార వైసీపీకి గుబులు పుట్టించింది. వీరిని ఎదుర్కొనలేక చాలా నియోజకవర్గాల్లో వైసీపీ తడబడే పరిస్థితి వచ్చింది. ఆత్మీయ కలయికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నియోజకవర్గ స్థాయి నేతలతోపాటు మండల, గ్రామ స్థాయి నేతలు పాల్గొంటూ ఉండడంతో ఎన్నికల వ్యూహం అమలుకు సులువైంది. ఎక్కడా పొరపచ్చాలు, భేదాభిప్రాయాలు తలెత్తకుండా ఈ మూడు పార్టీల కమిటీలు బాధ్యతలు భుజాన ఎత్తుకున్నాయి. తొలుత కొంత గ్యాప్ వచ్చినా రాను రాను సమసిపోవడం కూటమిలో ఆనందానికి దారితీసింది. ఏలూరు లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, నరసాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ అభ్యర్థిత్వాల ప్రకటన ఆలస్యమైనా వీరందర్నీ కూడబలుక్కొని ఆత్మీయ కలయికల పేరుతో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఎంపీ అభ్యర్థులకు ఇదొక ప్లస్ పాయింట్. అసెంబ్లీ అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు ఒక తేదీ నిర్ణయించుకుని నియోజకవర్గాల పర్యటనల్లో కలియ తిరుగుతున్నారు.

వైసీపీలో కలహాల కాపురం

ఉమ్మడి అభ్యర్థులు పరస్పర సమన్వయంతో ప్రచారంలో ముందంజలో ఉండగా చింతలపూడి వంటి నియోజక వర్గాల్లో అధికార వైసీపీలో కలహాలు కొనసాగుతూనే ఉన్నాయి. కామవరపుకోట మండలంలో ఒక చిన్న వివాదం ఆ పార్టీ నేతల్లో రాజీనామాలకు దారితీసింది. పోటీ చేస్తున్న అభ్యర్థి, స్థానిక నాయకత్వం మధ్య అగాధం ఏర్పడటమే దీనికి ప్రధాన కారణం. పార్టీ నేతల మధ్య పరస్పర సమన్వయం కొరవడడం విభేదాలకు, దూషణలకు, ఆఖరికి వ్యక్తిగత దాడులకు దారి తీస్తోంది. దీన్ని సర్దుబాటు చేసేందుకు వైసీపీ నాయకత్వం ముప్పుతిప్పలు పడుతోంది. చాలా నియోజకవర్గాల్లో ప్రచారంలో ముందుగా హడావుడి చేసి ఈ మధ్యనే ప్రచారంలో స్పీడ్ తగ్గింది. ఈలోపే కూటమి మూకుమ్మడిగా ప్రచారానికి దిగుతుండడం అధికార వైసీపీకి మింగుడు పడటం లేదు.

రాటు తేలిన జనసేన

ఉమ్మడి పొత్తులో భాగంగా ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం నుంచి అంజిబాబు, పోలవరం నుంచి చిర్రి బాలరాజు, నరసాపురం నుంచి నాయకర్ అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీకి దిగారు. ఈ నియోజక వర్గాల్లో తెలుగుదేశం పూర్తి సమన్వయంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో జనసేన ప్రచారంలో రాటు తేలింది. ఎక్కడికక్కడ స్థానిక సమస్యలు ప్రస్తావిస్తూ అందరిని కలుపుకుపోతూ మారుమూల గ్రామాల్లోనూ ఓటర్లకు నేరుగా పరిచయమవుతున్నారు. త్వరలోనే పవన్ కల్యాణ్ ఈ నియోజకవర్గాల్లో పర్యటించనుండటం దీనికి తగ్గట్టుగానే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రచారానికి హాజరు కానుండటం కలిసొచ్చే అంశాలు.



నరసాపురం టాక్సీస్టాండ్ వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న షరీఫ్, పొత్తూరి

నరసాపురం టు పాలకొల్లు

- చంద్రబాబు రోడ్ షో.. భారీ సభలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'ప్రజాగళం' యాత్ర శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా చేరుకోనుంది. నర్సాపురం, పాలకొల్లు పట్టణాల్లో నిర్వహించే రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటారు. వీటిని విజయవంతం చేసేలా టీడీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో గురువారం పర్యటించిన ఆయన రాత్రికి నల్లజర్లలో బసచేశారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులతో సమీక్షించి మధ్యాహ్నం రెండు గంటలకు హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.30 గంటలకు నర్సాపురంలోని స్వర్ణాంధ్ర కళాశాలకు చేరుకుంటారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించే అవకాశం ఉంది. స్టీమర్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే బహిరంగ సభ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సభలో మాట్లాడతారు. తర్వాత రోడ్డు మార్గంలో పాలకొల్లు చేరుకుని, గాంధీ బొమ్మ సెంటర్‌లో 5.15 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు. రాత్రికి పాలకొల్లులోనే బస చేస్తారు. ఈ రెండు సభలకు భారీగా జనం హాజరు కానున్నారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రకటించిన తర్వాత చంద్రబాబు తొలిసారి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇటీవల ఆచంటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలోను, తాడేపల్లిగూడెంలో జరిగిన తెలుగుదేశం-జనసేన జెండా సభలోను పాల్గొన్నారు. సభల ఏర్పాట్లను తెలుగుదేశం జోన్-2 ఇన్‌చార్జ్ మందలపు రవి, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ పర్యవేక్షించారు.



తాడేపల్లిగూడెంలో ఎంపీ రఘురామకు స్వాగతం పలుకుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

విజయం సాధించా

నరసాపురం ఎంపీ రఘురామరాజు

భీమవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):'నేను విజయం సాధించా. జగన్‌ను ఓడిపోయే స్థితికి తీసుకునివచ్చా. ప్రస్తుత ప్రభుత్వంలో అన్యాయాలు ఒక్క భీమవరానికే పరిమితం కాలేదు. రాష్ట్రమంతటా ఉన్నాయి. ప్రజలు చైతన్య వంతులయ్యారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బయటకు వస్తున్నారు' అని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. హైదరాబాద్‌లోవున్న ఆయన గురువారం తాడేపల్లిగూడెం, పిప్పర, యండగండి మీదుగా భీమవరం విచ్చేశారు. ప్రతిచోట తెలుగుదేశం, జనసేన నాయకులు, అభిమానులు ఎంపీకి సాదర స్వాగతం పలికారు. భీమవరంలో జనసేన నిర్వహించిన క్షత్రియ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. 'గతంలో భీమవరం వస్తే పట్టుమని నలుగురు కూడా రాలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు మారింది. జనసేన అభ్యర్థి అంజిబాబు వంటి పెద్ద మనిషి కోసం అంతా రావడం సంతోషకరమన్నారు. తెలుగుదేశం - బీజేపీ - జనసేన కూటమి విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో క్షత్రియులు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీలో మరింత విశ్వాసం

తెలుగుదేశం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఈ మధ్యన విశ్వాసం మరింత పెరిగింది. చింతలపూడి నుంచి సొంగా రోషన్‌కుమార్, ఏలూరు నుంచి బడేటి చంటి తొలిసారిగా బరిలో దిగుతున్నారు. రాజకీయాల్లో సీనియర్‌లుగా ఉన్న పితాని సత్యనారాయణ ఆచంట నుంచి, డాక్టర్ కామినేని శ్రీనివాస్ కైకలూరు నుంచి, చింతమనేని ప్రభాకర్ దెందు లూరు నుంచి నిమ్మల రామానాయుడు పాలకొల్లు నుంచి, కొలుసు పార్థసారథి నూజివీడు నుంచి, ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నుంచి ఎన్నికల బరిలో ప్రత్యర్థులను అధిగమించేం దుకు వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాడేపల్లిగూడెం, తణుకు నియోజక వర్గాల్లో పైచేయి సాధించేందుకు కూటమి నాయ కత్వాలు చొరవ తీసుకుంటున్నాయి. ఉండి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు రెండోసారి పోటీ చేస్తున్నారు.

ఊపునిస్తున్న చేరికలు

ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో అధికార వైసీపీని వీడి సీనియర్లు అందరూ కూటమిలో చేరుతున్నారు. ఇది అధికార వైసీపీకి గండి కొట్టేలా లేకపోలేదు. ఏలూరులో సీనియర్ నేత ఎం.ఆర్.డి బలరామ్ దంపతులు తాజాగా వైసీపీకి రాజీనామా చేశారు. నేడో రేపో టీడీపీలో చేరబోతున్నారు. దెందులూరులో మరికొందరు చింతమనేని ప్రభాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఇలా వరుసగా అన్ని నియోజక వర్గాల్లోనూ వైసీపీ నుంచి కూటమిలోకి వలసలు పెరగడం రానున్న ఫలితాలకు ముందస్తు సంకేతంగా భావిస్తున్నారు.

ప్రహసనంగా పింఛన్ల పంపిణీ

- రెండో రోజూ మండుటెండలో వృద్ధుల పాట్లు
- జిల్లాలో 89.81 శాతం పంపిణీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 4 : జిల్లాలో పింఛన్ల పంపిణీలో రెండో రోజూ ఇబ్బందులు తప్పలేదు. సచివాలయాల వద్ద పింఛన్‌ల పంపిణీ ప్రహసనంగా మారింది. ఎండలో గంటల తరబడి లబ్ధిదారులు సచివాలయాల వద్దే వేచి ఉండాల్సి వచ్చింది. మండుటెండలో వృద్ధులు అపసోపాలు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రతను తట్టుకోలేక పింఛన్ తీసుకోవడానికి సచివాలయాలకు రాని పరిస్థితి కనిపించింది. తొలిరోజు బుధవారం మధ్యాహ్నం తర్వాత పింఛన్‌లు పంపిణీ ప్రారంభమైనా రెండోరోజు పింఛన్‌ల పంపిణీ ఉదయమే ప్రారంభమైంది. జిల్లాలో 2లక్షల 70వేల 804 పింఛన్ దారులకు మొత్తం 80 కోట్ల91లక్షల 53వేల రూపాయలు అందించాల్సి ఉంది. గురువారం సాయంత్రానికి అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 2లక్షల 39వేల 814 మందికి (89.81 శాతం) 72కోట్ల 67 లక్షల 28వేల రూపాయలు అందజేసినట్టు అధికారులు తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల మంచం పట్టిన వృద్ధులకు ఇంటి వద్దే సొమ్మును సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు.

ప్రతిపక్షాలపై నిరాధార ఆరోపణలు

ఇదిలా ఉండగా ఎన్నికల కమిషన్ ఇంటింటికీ పింఛన్‌లు పంపిణీ చేయవద్దని చెప్పలేదని, సరిపడ సిబ్బంది ఉన్నా ఇంటింటికీ పంపిణీ చేయడం లేదని, పైపైచ్చు అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షాలపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఖండిస్తున్నారు.

వైసీపీకి భారీ షాక్

- ఎంఆర్డీ బలరామ్ దంపతుల రాజీనామా

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4 : ఏలూరులో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీలో ఇప్పటి వరకు కీలకంగా వ్యవహరించిన మధ్యాహ్నపు బలరామ్, ఈశ్వరీ దంపతులు పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి అనివార్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గ అబ్జర్వర్ పదవికి కూడా రాజీ నామా చేస్తున్నట్టు బలరామ్ ప్రకటించారు. ఎంఆర్డీ ఈశ్వరీ బలరామ్ ఈడా ఛైర్మన్‌గా మూడేళ్ల ఆ పదవిలో కొనసాగారు. కొంత కాలంగా పార్టీకి బలరామ్ దంపతులు దూరం గా ఉన్నారు. శుక్రవారం నరసాపురం వస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్టు సమాచారం.



బలరామ్ దంపతులు

ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాజీనామా

ఏలూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ రామకృష్ణ తన పదవితో పాటు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం పార్టీకి లేఖ పంపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీకి విశేష సేవలు అందించారు. ఇటీవల కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉన్నారు.

పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 4 : సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ గురువారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు తొలి ర్యాండమైజేషన్‌లో పీవో, ఏపీవోలకు విధుల కేటాయింపులో భాగంగా సంబంధిత నియోజకవర్గాల వారీగా శిక్షణ నిమిత్తం గుర్తించారు. జిల్లాలో 1750 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 11,798 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అందులో 2,150 మంది ప్రిసైడింగ్ అధికారులు, 2,150 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7,498 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు. జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, ఎన్ఐసి అధికారి శర్మ, డీఈవో అబ్రహం, ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో సుబ్బారావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల రిసెప్షన్ కేంద్రం పరిశీలన

ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏలూరు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లులో భాగంగా ఏలూరులో కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల రిసెప్షన్ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రిని పంపిణీకి అవసరమైన స్టాల్స్‌ను, బస్సు రూట్లను, ఎన్నికల సిబ్బందికి ఫుడ్ కోర్టును, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసరావులకు దిశా నిర్దేశం చేశారు.

అక్రమ నీటి వినియోగ నివారణకు బృందాలు

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4 : ప్రకాశం బ్యారేజ్ నుంచి నీరు విడుదలవుతున్న దృష్ట్యా తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇతర అవసరాలకు అక్రమ నీటి వినియోగాన్ని నివారించడానికి జిల్లా, డివిజనల్, మండల గ్రామ సచివాలయ స్థాయి బృందాలను ఏర్పాటు చేసి డాక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. హీట్‌వేవ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మంచినీటి కాల్వల నుంచి ప్రైవేట్ చేపల రొయ్యల చెరువులకు అక్రమంగా నీటిని వినియోగించకుండా పర్యవేక్షణకు ఈ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో డీఆర్వో ఛైర్మన్‌గా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అదనపు, మత్స్యశాఖ జేడీ, డీపీవో, ఇరిగేషన్ ఎస్ఈలతో బృందాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఈఆర్డీవో, డీఎస్పీ, ఇరిగేషన్ డీఈ, మత్స్యశాఖ ఏడీ, డీఎల్‌డీవోలను నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, సీఐ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ ఈ బృందంలో ఉంటారు. గ్రామ స్థాయిలో సెక్రటరీ ఆధ్వర్యంలో వీఆర్వో ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, గ్రామ మత్స్య అసిస్టెంట్ ఉంటారు.



వేలేరు చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీ మురళీకృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ సరిహద్దులోని జీలుగుమిల్లి, మేడేపల్లి, వేలేరు, అల్లిపల్లి, సింగగూడెం చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాలను క్షుణ్ణంగా అన్ని కోణాల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎటు వంటి అక్రమ కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం వాహన తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల సమయంలో ఏమి చేయాలో, చేయకూడదో స్పష్టంగా సిబ్బందికి వివరించారు. వాహన డ్రైవర్లు, యజమానులు, పాసింజర్ల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు.

కోడ్ ఉల్లంఘించి.. అపార్టుమెంట్‌లో చీరల పంపిణీ

- ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : ఎన్నికల కోడ్‌ను అతిక్రమించి చీరలను పంచుతున్న ఇద్దరిపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు గవరవరంలోని సత్యసాయి రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న పునుగుపాటి వెంకట రమణ మరో వ్యక్తి కలిసి ఏలూరు ఇజ్రాయిల్ పేటలో చీరలను పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి వీరు చీరలు పంపిణీ చేయడంతో విపర్తి మహేంద్రనాథ్ ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటరమణ మరో వ్యక్తిపై ఎన్నికల నిబంధనలు అతిక్రమించారంటూ కేసు నమోదు చేశారు.



వేగవరం చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన రూ.7లక్షలు

రూ.10,17,100 సీజ్

జంగారెడ్డిగూడెం/ కామవరపుకోట/ భీమడోలు /గణపవరం, ఏప్రిల్ 4 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న తరుణంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వేగవరం ఎస్ఎస్‌టి చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా జంగా రెడ్డిగూడెం వైపు వస్తున్న ఒక స్కూటీలో రూ.7 లక్షల నగదు ఎస్ఎస్‌టీ టీం, ఫ్లైయింగ్ స్క్వాడ్ గుర్తిం చారు. ఎటువంటి బిల్స్ చూపించక పోవ డంతో సీజ్ చేసి ట్రెజరీకి తరలించినట్టు జంగా రెడ్డి గూడెం ఎస్ఐ జ్యోతిబస్ తెలిపారు. ఎన్నికల కోడ్‌అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలు పైబడి నగదు తీసుకువెళ్తే దానికి సంబంధించిన బిల్లులు కచ్చితంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

- కామవరపుకోట పంచాయతీ కొత్తూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలలో భాగంగా గురువారం చింతలపూడికి చెందిన వ్యక్తి నుంచి రూ. 76,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఎంఆర్‌వో రమేష్, డీటీ ఎండీ మొహిద్దీన్, తడికలపూడి ఎస్ఐ జయబాబు, స్కాడ్ అధికారి సత్యవేణి, వీఆర్‌వో బాబూరావు, ఉన్నారు.
- భీమడోలు మండలం పోలసానపల్లిలో నిర్వహించిన తనిఖీల్లో అధికారులు రెండు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు సీఐ రవికుమార్, సీఎస్‌డీటీ మాధవరావు, తదితరులు పోలసానపల్లి హైవేపై నిర్వహించిన తనిఖీల్లో కారులో రెండు లక్షల రూపాయలు గుర్తించి స్వాధీనపర్చుకున్నామన్నారు.
- గణపవరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ నిర్వహించి తనిఖీల్లో రూ.లక్ష 40,500 నగదు సీజ్ చేసినట్లు ఏలూరు ఆర్‌డీవో ఎస్ఎస్‌కే ఖజావలి తెలిపారు.స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీలో అప్పగించామన్నారు.

23.72 లీటర్ల మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఏడు వేల 950 రూపాయల విలువైన 23.72 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు 10 లక్షల 40 వేల 500 రూపాయలు అని తెలిపారు.



సూపర్ ఐడియా !

ఎండలు మండిపోతున్నాయి. బయటకు అడుగు పెడదామంటే భయమేస్తోంది. ఎండ నుంచి రక్షణకు తమ బైక్‌లకు ఇలా గొడుగులు ఏర్పాటు చేసుకుని హాయిగా ప్రయాణిస్తున్నారు. ఏలూరులో కనిపించిన దృశ్యాలు ఇవి..

- ఫొటో గ్రాపర్,ఏలూరు



ఇటు చూడండి సారూ..!

మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామ సచివాలయం సమీపంలో ఓహెచ్ఆర్ ట్యాంకులకు తాగునీటిని లిఫ్ట్ చేసే పైప్‌లైన్‌కు రంధ్రాలు ఏర్పడటంతో ఐదు నెలలుగా కుళాయినీరు లీక్ అవుతోంది. దీంతో కాళీపట్నం తూర్పు, కొత్తోటల్లోని ఓహెచ్ఆర్ ట్యాంకులకు నీరు అందక రెండు పంచాయతీల్లోనూ నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్ మేడిద మాధవి ప్రభాకర్‌లు తెలిపారు.



- మొగల్తూరు

నిమ్మ అధరహో..



కిలో నిమ్మ రూ.70 ..రైతుల్లో ఆనందం

తగ్గిన పంట విస్తీర్ణం..దిగుబడిపై ప్రభావం

పెదవేగి, ఏప్రిల్ 4 : నిమ్మ రైతుల పంట పండింది. ధరలు రైతుల ఆశలకు అనుగుణంగా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా నిమ్మకాయల ధర కిలో రూ.50 నుంచి రూ.70 మధ్య నిలకడగా ఉంది. దీంతో రైతులు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఏటికేడాది నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతుండగా నెలరోజులుగా ధర ఆశాజనకంగా ఉండడం హర్షించదగ్గ విషయమంటున్నారు. గతంలో ధర పెరిగినా వారం పదిరోజుల వరకే ఉండేది. కానీ ఇప్పుడు నెలరోజులుగా ధర నిలకడగా ఉండడం లాభదాయకమని రైతులు చెప్తున్నారు. పెరిగిన డిమాండ్, తగ్గిన దిగుబడి కారణంగానే నిమ్మకాయల ధర పెరిగిందని, ఈ ధర ఈ నెలాఖరు వరకు ఇలాగే కొనసాగితే అప్పుల కష్టాలు తీరిపోతాయని రైతులు ఆశతో ఉన్నారు. కాయలు లేనప్పుడు ధర ఎంత ఉంటే మాత్రం ఏం లాభమని కొంతమంది రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో కాయ ఒక్కింటికి నాలుగైదు రూపాయలకు విక్రయిస్తున్నారు. మొన్నటివరకు సరైన ధరలేక నిమ్మ తోట లను తెగనరికిన రైతులు ఇప్పుడు ఈ ధరను చూసి ఉసూరు మంటున్నారు. ఒక్క బస్తా (50 కిలోలు) తీసుకెళ్లినా ఆశించిన సొమ్ము వచ్చేది కదా అని మదనపడుతున్నారు.



యార్డులో ఎగుమతికి సిద్ధం చేస్తున్న హమాలీలు

30 లారీలకు పడిపోయిన ఎగుమతులు

మార్చి, ఏప్రిల్ నెలలో నిమ్మకాయలు దక్షిణభారతం నుంచి ఉత్తర భారత దేశానికి సాధారణంగా 200 వరకు లారీల సరుకు వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు 30 లారీలకు పడిపోయింది. దిగుబడి గణనీయంగా తగ్గడంతో సరుకులేక ధర పెరిగింది. దిగుబడి తగ్గడానికి గత నవంబరులో పడిన వర్షాలే కొంత వరకు కారణం. ఈ వర్షంతో నిమ్మ పూత మొత్తం రాలి పోయింది. దిగుబడి తగ్గి మార్కెట్‌కు కాయలు రాక తగ్గిపోయింది. ధర పెరగడానికి ఇది కూడా ఒక కారణం. ఉత్తర భారతంలో నిమ్మకాయల వాడకం కూడా పెరిగింది. నెలన్నర రోజులుగా ధర నిలకడగా ఉంది.

85 శాతంపైగా రైతులకు మేలు



గతంలో ఎప్పుడూ కూడా ఇన్నిరోజులు ఇంతలా ధర ఉన్న దాఖలాలు లేవు. గట్టిగా రెండు, మూడు వారాలు ధర గరిష్టంగా ఉండేది. ఆ సమయంలో కాయలు ఉన్నవారు దాదాపుగా 25 నుంచి 30 శాతం మంది రైతులే లాభాలను అందుకునేవారు. కానీ ఈసారి 85 శాతం పైగా రైతులు గరిష్ట ధరను అందుకున్నారు..

- అలపాటి రంగారావు, దెందులూరు
మార్కెట్‌యార్డు వర్తక సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లి

పెరిగిన ఎగుమతులు



నెలన్నరగా కిలో రూ.45 నుంచి రూ.80 వరకు ధర లభిం చడం రైతుకు లాభదాయకం. ఇది ఇలాగే మరో 15 రోజుల వరకు ఉండే అవకాశం ఉంది. కొంత మంది రైతులు ధర లేనప్పుడు చెట్లను కొట్టేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం అనేది చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. సాగులో ఒడిదుడుకులు అనేవి సహజం. అన్ని టిని తట్టుకుని నిలబడితే ఎప్పటికైనా లాభమే ఉంటుంది..

- తాతా యశ్వంత్ రాజశేఖర్, వర్తవ సంఘం సభ్యుడు, పెదవేగి

ఉపాధిహామీ పథకం అమలు చేయాలి



ఈ ఏడాది నిమ్మ కాయల దిగుబడి తగ్గింది. తక్కువ దిగు బడి వచ్చినా ధర బాగుండడంతో ఆశించిన ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగి పోయింది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. కిలో రూ.50లకు తగ్గకుండా ఉంటే లాభదాయకంగా ఉంటుంది. ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుంది. ఉపాధిహామీ పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- మారగాని ప్రసాద్, రైతు, లక్ష్మీపురం



రబీ ధాన్యం తూకం వేయిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శివరామ్

గణపవరం, ఏప్రిల్ 4: రబీ ధాన్యాన్ని రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జే.వెంక టేశ్వరరావు తెలిపారు. గురువారం సీహెచ్ అగ్రహారం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. గణపవరం మండలంలో 48 వేల 311 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ధాన్య మొత్తం ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. గోనె సంచులు కొరత లేకుండా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శివరామ్ మాట్లాడుతూ ధాన్యం రైతులు మద్దతు ధర కంటే బయట ఎక్కువ ధర వస్తున్నట్లయితే అమ్ముకోవచ్చన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. డీఎస్‌వో సరోజిని, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో వైవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలను ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చెయ్యాలి : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్,ఏప్రిల్ 4 : జిల్లాలో ఉన్న అన్ని రకాల ప్రైవేట్ ఆసుపత్రులు యాజమాన్యాలు తమ ఆసుపత్రి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సైట్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.మహేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా నర్సింగ్‌హోంలు, క్లినిక్‌లు ఆన్‌లైన్‌లో నమోదు కావాలన్నారు. పనిచేసే డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందరూ ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాకాని పక్షంలో నవోదయ ఐడీ క్రియేట్ చేసిన వారికే వైద్యం చేయడానికి అనుమతులు ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా టీబీ, లెప్రసీ ఎయిడ్స్ అధికారి డాక్టర్ బి.భానునాయక్, డీసీ ఆరోగ్యశ్రీ డాక్టర్ కీర్తి కిరణ్, పి.అనంతలక్ష్మి, వీఎస్ఆర్‌కె కుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల బదిలీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పలువురి సీనియర్ సివిల్ న్యాయాధికారులు, జిల్లా సెషన్స్ న్యాయాధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది సీనియర్ సివిల్ న్యాయాధికారులను, 30 మంది అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది. పిఠాపురం సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తున్న మాదవిని, తాడేపల్లిగూడెం బదిలీ చేశారు. అనకాపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గంగరాజును నర్సాపురంలో నియమించారు. ఏలూరు అడిషనల్ సివిల్ న్యాయాధికారి విజయను యలమంచిలి బదిలీ చేశారు. తాడే పల్లిగూడెం సివిల్ న్యాయాధికారి ప్రకాష్‌బాబును రాజ మహేంద్రవరం జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శిగా నియమించారు. చిత్తూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసమూర్తిని ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారిగా నియమించారు. ఏలూరు ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి బుల్లికృష్ణను ఏలూరు అడిషనల్ సివిల్ న్యాయాధికారి గా నియమించారు. ప్రకాశం పోక్సో కోర్టు సెషన్స్ న్యాయాధి కారి సోమశేఖర్‌ను భీమవరం పోక్సో కోర్టు సెషన్స్ న్యాయాధికారిగా నియమించారు. విజయనగరం నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి షేక్ సికిందర్‌బాషాను తాడేపల్లి గూడెం 11వ అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. ఏలూరులోని మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి రామ్‌గోపాల్‌ను తిరుపతి ఐదవ అదనపు సెషన్స్ న్యాయాధికారి, ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారిగా నియ మించారు. భీమవరం మూడవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికార్శి శ్రీసత్యదేవిని విశాఖపట్టణంలోని ఎస్సీఎస్టీ కోర్టు, 11వ జిల్లా అదనపు సెషన్స్ న్యాయాధికారిగా నియమించారు.

దొంగలు... బాబోయ్ దొంగలు..

పెంటపాడు మండలంలో చోరీల జోరు

రాత్రయితే షాపుల తాళాలు పగులగొట్టి..

ఇంటి బయట బైక్‌లు, సైకిళ్లు మాయం

బెంబేలెత్తుతున్న ప్రజలు



పెంటపాడు, ఏప్రిల్ 4 : పెంటపాడు మండలంలో దొంగలు చెలరేగి పోతు న్నారు. రాత్రయితే చాలు షాపులపై పడి దొరికింది పట్టుకుపోతున్నారు. చూపుతున్నారు. ఇళ్ళ వద్ద బయట పెట్టుకున్న మోటార్‌సైకిళ్ళు సైకిళ్లను మాయం చేస్తున్నారు. వాళ్ల కుక్కుర్తి ఏ స్థాయిలో ఉందంటే పూల కుండీలను కూడా వదలడం లేదు. పెంటపాడు పీహెచ్‌సీలో ఇటీవల దొంగతనం జరిగింది. బయట తలుపు తాళాలను పగులకొట్టి దొంగ లోపలికి ప్రవేశించాడు. అక్కడ ఏమీ దొరకక పోవడంతో ఆసుపత్రిలో ఉన్న దూది, ఇంజక్షన్‌లను నిప్పు పెట్టాడు. రికార్డులను కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నం జరిగింది. పక్క రూంలోనే ఆసుపత్రికి సంబంధించిన ఆక్సిజన్ సిలెండర్లు ఉన్నాయి. మంటలు కొంచెం ఎక్కువైతే పెను ప్రమాదమే జరిగి ఉండేది. కే.పెంటపాడు గ్రామంలో ఒకే రోజు రాత్రి రెండు సిమ్మెంట్ షాపులలో దొంగతనాలు జరిగాయి. ఒకరే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. షాపు నకు పైన ఉన్న రేకులను తప్పించి దొంగ లోపలికి వెళ్ళి కౌంటర్‌లో ఉన్న నగదు తీసుకువెళ్ళిపోయాడు. ఒక షాపులో రూ.6 వేలు, మరొక షాపులో రూ.35 వేల వరకూ చోరీకి గురైనట్లు సమాచారం. పరిమెళ్ళ గ్రామంలో గ్రామ సర్పంచ్ మోటర్‌సైకిల్ తీసుకువెళ్ళిపోయారు. మండల కేంద్రమైన పెంటపాడులో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఇంటి ముందు ఏం పెట్టుకున్నా తెల్లవారేసరికి ఉంటాయో లేదో అన్నట్లుగా పరిస్థితి తయారైంది. రాత్రి వేళల తాళాలు వేసి పెట్టుకున్న బైక్‌లు కూడా మాయమవుతున్న సంఘటనలు నెలకొన్నాయి. ఇంటి ముందు పెట్టిన పూలకుండీలను కూడా దొంగలు వదలడం లేదు. కాలేజ్ సెంటర్ సమీపంలో పలువురి ఇంటి బయట పెట్టుకున్న సైకిళ్ళు, మోటారు సైకిళ్లు మాయమయ్యాయి. పెంటపాడు గేటు సెంటర్ వద్ద ఒక ల్యాబ్ పక్కనే ఉన్న షాపుల్లో ఒకే రాత్రి దొంగతనాలు జరిగాయి. అయితే పెద్దగా నష్టం లేకపోవడంతో షాపు యజమానులు ఊపిరి తీసుకున్నారు. ఒకపక్క ఎన్నికల హడావుడి గ్రామాలలో కనిపిస్తుండగా సందట్లో సడేమియాగా దొంగతనాలు కూడా ఎక్కువైపోయాయి. పోలీసులు దృష్ట సారించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.





మధుసూదన్‌రెడ్డి, సత్యప్రసాద్‌లతో నిట్ ఆచార్యులు

విద్యార్థులు నూతన లోహాలపై పరిశోధనలు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 4 : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో భారత్ ప్రపంచదేశాలకు దీటుగా దూసుకెళ్తుందని శాస్త్రవేత్త, విశ్రాంత డైరక్టర్ (డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబోరేటరీ-డీఆర్డీవో) డాక్టర్ జీ.మధుసూధనరెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో మెటీరియల్స్ ఫర్ డిఫెన్స్ అండర్ ఏరోస్పేస్ అప్లికేషన్స్ అనే అంశంపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎంఈ విభాగాధిపతి డాక్టర్ రఫీ మహ్మమ్మద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత, నిఘా వ్యవస్థకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. అంతరిక్షంలో ప్రయోగించే వాహనాల్లో అధిక ఉష్ణోగ్రత తట్టుకునే నూతన లోహాలపై స్వదేశీ పరిజ్ఞానంతో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని, విద్యార్థులు కూడా ఆ దిశగా ఆలోచనలు చేసి నూతన లోహాలపై పరిశోధనలు చేయాలన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. అనంతరం మదుసూధన్‌రెడ్డి, సత్యప్రసాద్‌లను శాలువా, మెమోంటోలతో సత్కరించారు. ఆచార్యులు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ వి.సందీప్ పాల్గొన్నారు.

నూజివీడు టీడీపీ కార్యాలయం వద్ద అధికారుల హడావుడి

నూజివీడు, ఏప్రిల్ 4: నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్ని కల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ కార్యాలయ ప్రహరీకి ఏర్పాటు చేసిన బ్యానర్లను రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు హడావుడి జరిగింది. రెవెన్యూ, పోలీస్ అధికారులతో టీడీపీ కార్యకర్తలు తమకు అనుమతిపత్రాలు ఉన్నాయంటూ చూపారు. ఈ సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీవో, ఆర్వో వై.భవానీశంకరి ఘటనా స్థలానికి చేరుకుని ఎన్నికల నిబంధనలను వివరించి సర్దుబాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతికి మించి ఏర్పాటు చేసిన బోర్డులను వెంటనే తొలగించి శనివారం ఉదయంలోగా బోర్డును కార్యాలయం వద్ద ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఇద్దరు పింఛన్‌దారుల మృతి



అప్పల నరసమ్మ (ఫైల్)



తిరుపతయ్య మృతదేహం

ఉంగుటూరు /చాట్రాయి, ఏప్రిల్ 4 : ఏలూరు జిల్లాలో వేర్వేరు కారణాలతో నలు గురు పింఛన్‌దారులు మృతి చెందారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన పింఛన్‌దారు జనపరెడ్డి అప్పల నరసమ్మ (78) అనే వృద్ధురాలు బుధవారం ఉదయం పింఛన్ కోసం గ్రామ సచివాలయం వద్దకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత సాయంత్రం ఇస్తారని చెప్పడంతో ఎండలో తిరిగి ఇంటికి వచ్చింది. సాయంత్రం మరల వెళ్లే క్రమంలో ఇప్పుడైనా ఇస్తారో.. లేదోనంటూ ఒత్తిడికి గురై ఇంట్లోనే ఆయాసం రావడంతో ఒక్కసారిగా నీరసించి కుప్పకూలి మృతి చెందింది. చాట్రాయి మండలం చీపురుగూడెం శివారు మేకలగూడెంకు చెందిన మేకల తిరుపతయ్య(70) బుధవారం పింఛను తీసుకోటానికి కిలోమీటరు దూరంలోని సచివాలయానికి ఎండలో కాలినడకన వెళ్లి ఇంటికి వచ్చాక వడ దెబ్బ కారణంగా అస్వస్థతకు గురైయ్యాడు. కుటుంబ సభ్యులు 108లో చింతలపూడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి

- జిల్లాల విభజన జరిగి రెండేళ్లు పూర్తి
- ఏలూరు వచ్చేందుకు ముదినేపల్లి మండల వాసుల పాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 4 : కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్ల గడిచినా ముదినేపల్లి మండలం నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పడలేదు. గురువారం నాటికి జిల్లాల పునర్విభజన జరిగి సరిగ్గా రెండేళ్ల. 2022 ఏప్రిల్ 4న కొత్త జిల్లాలు ఏర్పడగా, ఏలూరు లోక్‌సభ పరిధిలో ఉన్న కైకలూరు అసెంబ్లీ నియోజక వర్గం కృష్ణాజిల్లా నుంచి విడిపోయి ఏలూరు జిల్లాలో కలిసింది. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం ఉండేది. ఇప్పటికీ ఆ సౌకర్యం కొనసాగుతూనే ఉంది. కొత్త జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ అధికారులు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం కల్పించలేదు. అప్పటి నుంచి బస్ సర్వీస్ కోసం ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారులను కలసి కోరినా నేటికీ ఫలితం లేదు. ముదినేపల్లి నుంచి ఏలూరుకు సరాసరి బస్ సౌకర్యం లేక మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలు గుడివాడ, కైకలూరు మీదుగా చుట్టూ తిరిగి బస్సులు మారుతూ వెళ్లాల్సి వస్తుంది. ఏలూరు నుంచి కైకలూరు, మండవల్లి మీదుగా ముదినేపల్లికి బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.





4-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	230	238.55
జంగారెడ్డిగూడెం-1	242	235	239.95
జంగారెడ్డిగూడెం-2	241	235	239.82
కొయ్యలగూడెం	242	235	240.04
గోపాలపురం	242	235	240.24

క్రైం కార్నర్

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : మద్యానికి బానిసైన ఒక యువకుడు మద్యం తాగడానికి సొమ్ములు ఇవ్వలేదని కోపగించుకుని తీవ్ర మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు మేదరవారి వీధినకు చెందిన నర్రా దుర్గాసాయి కార్తీక్ (19) తాగుడుకు బానిసఅయ్యాడు. డబ్బులు ఇవ్వనప్పుడల్లా చేతులు కోసుకుని బెదిరిస్తూ ఉంటాడు. అతనికి తాగడానికి డబ్బులు ఇవ్వలేదని బెదిరించి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తల్లి నర్రా సత్యవతి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కారు ఢీ కొని మహిళ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : స్నేహితుల వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీ కొనడంతో ఆ మహిళల అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త తీవ్ర గాయాలకు గురయ్యాడు. గన్నవరంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తాతాపూడి వెంకట రమణ ఆయన భార్య పద్మశ్రీ (57) కలిసి ఈనెల 3వ తేదీ రాత్రి భీమడోలులోని స్నేహితుల కుటుంబంలో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై గన్నవరం వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ వద్ద వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న కారు మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మశ్రీ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆయనను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈసంఘటనపై ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 : పనిమీద తణుకు వెళ్ళి తిరిగి మోటారు సైకిల్‌పై తన ఊరికి వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరుకు చెందిన అన్నవరపు పుష్పరాజు (21) ఈనెల 3వ తేదీ రాత్రి తణుకు వచ్చి తిరిగి బుధవారం అర్ధరాత్రి మోటారు సైకిల్‌పై గుంటూరు వెళుతుండగా ఏలూరు సమీపంలోని చొదిమెళ్ళ వద్ద వేగంగా వెళ్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రిటౌన్ పోలీసులకు అందడంతో త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- కాలి బూడిదైన రూ.3.60 లక్షల నగదు, ఐదు కాసుల బంగారం



చాట్రాయి, ఏప్రిల్4: చాట్రాయి మండలం తుమ్మగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి షేక్ మెహబూబ్‌అలీకి చెందిన రేకుల షెడ్ దగ్ధమైంది. రూ.3.60 లక్షల నగదు, 5 కాసుల బంగారం ఇంటి సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు



కైకలూరు, ఏప్రిల్ 4: నాటు తుపాకీ కలిగిన వ్యక్తిని అరెస్టు చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నామని కైకలూరు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం శీతనపల్లిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెల్లూరు జిల్లా సింగవరం గ్రామానికి చెందిన ఎస్.విజయన్ వద్ద తుపాకీలు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పాలకొల్లులో మహిళల కొట్లాట

పాలకొల్లు టౌన్, ఏప్రిల్, 4 : పాలకొల్లు రామయ్యహాల్ ప్రాంతంలో మతపరమైన తగాదాలు రోజురోజుకు రాసుకుంటున్నాయి. గురువారం వాటర్ ట్యాంక్ దగ్గర నీళ్లు పట్టుకుంటున్న నాగలక్ష్మి అనే మహిళపై వలంటీర్ మంజు, ఇద్దరు మహిళలు దాడి చేశారు. ఈ ఘటనలో నాగలక్ష్మికి చేతికి, మెడకు గాయాలవడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. రానున్న ఉగాది, శ్రీరామనవమి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ నాగలక్ష్మి, కొందరు మహిళలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గతంలో రామయ్యహాల్ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం నెలకొల్పేందుకు ఈమె ప్రయత్నం చేసింది. అప్పటి నుంచీ ఈ ప్రాంతంలో మతపరమైన వివాదం నడుస్తున్నది. నాగలక్ష్మి మాట్లాడుతూ తనపై కక్ష కట్టి దాడి చేశారని ఆరోపించింది. విశ్వహిందూ పరిషత్ నాయకులు మహిళా నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న నాగలక్ష్మిని పరామర్శించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటర్ ట్యాంక్ వద్ద జరిగిన తగువు మాత్రమేనని పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

వలంటీర్లకు ఎన్డీఏ ప్రభుత్వం న్యాయం చేస్తుంది : గన్ని

భీమడోలు, ఏప్రిల్ 4: వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే వ్యతిరేకమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని గన్ని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేక పింఛన్లు ఇవ్వడం లేదని, జీతాలు కూడా లేవని ఆయన అన్నారు. వలంటీర్లను రెచ్చగొట్టి వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తుందని గన్ని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయాలని, వలంటీర్లతో పంపిణీ కుదరదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. పింఛన్ల పంపిణీలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులతో జగన్ కొత్త డ్రామా ఆడుతున్నాడని ఆరోపించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నిధుల కొరతతో పింఛన్లు జాప్యం

జంగారెడ్డిగూడెం: వైసీపీ ప్రభుత్వంలో నిధుల కొరత కారణంగా సకాలంలో పింఛన్లు ఇవ్వలేకపోయారని ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు కారణంగానే పింఛన్లు ఇవ్వలేకపోయామని బురద జల్లే నీచ రాజకీయాలకు వైసీపీ తెర తీసిందని విమర్శించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి నెల 1న రూ.4వేలు పెన్షన్ అందిస్తామన్నారు. వలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని, కొంత మంది వలంటీర్లు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లకు రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

వైసీపీకి దోపిడీ తప్ప అభివృద్ధి చేతకాదు : చింతమనేని



సాంబశివరావును ఆహ్వానిస్తున్న చింతమనేని

దెందులూరు, ఏప్రిల్ 4: వైసీపీ ప్రభుత్వానికి దోపిడీ తప్ప అభివృద్ధి చేతకాదని, అసమర్థ, అవినీతి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విరక్తి చెంది వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్నారని ఆయన అన్నారు. మండలంలోని పోతునూరు టీడీపీ కార్యాయంలో కాంగ్రెసు పార్టీ సీనియర్ నేత కొత్త సాంబ శివరావు, వైసీపీ నేత కర్రోతు ప్రసాద్, బెడవాడ వెంకన్న, నున్న శేషగిరి, గాలి వెంకటేశ్వరావు, ముత్త సత్యనారాయణ, బోడేటి కృష్ణ, 80 మంది వైసీపీ కార్యకర్తలు చింతమనేని సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జయహో బీసీ కార్యక్రమంలో చింతమనేని మాట్లాడుతూ రక్షణ చట్టం తీసుకువచ్చి బీసీలను ఆదుకుంటామన్నారు. నున్న లక్ష్మణ్, బోడేటి మోహన్ బాబు, తలారి దన్య కుమార్, జక్కుల ఆశబాబు, రామ్ ప్రసాద్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

కొయ్యలగూడెం, ఏప్రిల్ 4: మండలంలోని యర్రంపేట గ్రామం నుంచి సుమారు 100మంది నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు సమక్షంలో వీరంతా పార్టీ కండువాలు వేసుకుని పార్టీలో చేరారు. తామంతా ఉమ్మడి ప్రభుత్వంలో పని చేయాలనే ఉద్దేశంతోనే పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ గ్రామం నుంచి భారీగా చేరికలు జరగటంతో జనసేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన గ్రామ నాయకులు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓట్లతో బుద్ధి చెప్పండి : ఎంపీ అభ్యర్థి మహేష్



మాట్లాడుతున్న మహేష్ యాదవ్

దెందులూరు, ఏప్రిల్ 4: ప్రజలు జగన్‌కు మళ్లీ ఓటు వేస్తే మన భూములపై మనకు హక్కు ఉండదని, సొంత చెల్లెలు, తల్లికి న్యాయం చేయలేని సైకో ముఖ్యమంత్రి జగన్‌కు ఓట్లతో ప్రజలందరూ ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ అన్నారు. దెందులూరులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సమావేశం గురువారం రాత్రి జరిగింది. మహేష్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఘంటశాల వెంకటలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ కిషోర్ మాట్లాడారు, మూడు పార్టీలు కలిసి వైసీపీని చిత్తుగా ఓడించాలన్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమికి వ్యూహాలపై చర్చించారు. వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సుందరం, వైసీపీ నేత ధరణికోట పోతురాజు, సంపంగి వేణుగోపాల తిలక్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

లక్కవరంలో జయహో బీసీ సదస్సు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4 : తెలుగుదేశం పార్టీ బీసీలకు రక్షణ చట్టం తేనుందని, 50 ఏళ్ల వారికి పించన్ ఇస్తుందని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని లక్కవరం బీసీ కాలనీలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు బూసా సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు ఎప్పుడూ వెన్నంటే ఉండేది టీడీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, గద్దె వెంకట సుబ్బారావు, కుక్కల మాధవరావు కంబపు రామిరెడ్డి, కొమ్మరజు సత్యనారాయణ, టీడీపీ బీసీ సెల్ నాయకులు, జనసేన నాయకులు బండారు సురేష్ నాయుడు, దల్లి ఆశిరెడ్డి, దల్లి దుర్గారెడ్డి, దల్లి గురునాథ్ రెడ్డి, పరచిన నాగిరెడ్డి, దల్లి రాజు, జీరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిపై వైభవంగా మాస కల్యాణోత్సవం



శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఫాల్గున మాస శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం ఆలయ అర్చకులు నల్లూరు రవికుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెంకు చెందిన రాంబాబు, నాగ వెంకట గంగాభవాని దంపతులు, అశ్వారావుపేటకు చెందిన వెంకటేశ్వరరావు, శాంత కుమారి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కల్యాణం అనంతరం ఉభయ దాతలకు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దోసపాడులో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు, ఏప్రిల్ 4: దోసపాడులో గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా హోమాలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు, కుంకుమ, పంచామృతాలతో గంగానమ్మను అభిషేకించి బోనాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జనసేన మహిళా నేత ఘంటశాల వెంకటలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం కాకర్ల శ్రీను, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

పోలవరంలో నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పోలవరం, ఏప్రిల్ 4: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ, అల్లవరపు సుబ్రహ్మణ్యం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి రెండు వేలమందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

టి.నరసాపురం, ఏప్రిల్ 4: మక్కినవారిగూడెం కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఏలూరులో ప్రజా సంకల్ప యాత్రలో బడేటి చంటి



జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో రోషన్‌కుమార్



ఉంగుటూరు మండలం కైకరంలో ధర్మరాజు ప్రచారం



కొయ్యలగూడెం మండలంలో కరాటం రాంబాబు, బాలరాజు

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రచారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4: ప్రభుత్వ వ్యతిరేక జ్వాలలను ఒక్కటిచేసి వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వేదికగా నిలిచిందని ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డిఅప్పలనాయుడు అన్నారు. 48వ డివిజన్‌లో మెట్లకోనేరు వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ కూడా మాట్లాడారు. వైసీపీ పాలన అంతమైతేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సుమారు 150మంది టీడీపీ, జనసేన పార్టీలో చేరారు. వందనాల శ్రీనివాసరావు, కె.తిరుపతిరావు, సరిది కృష్ణవేణి, మాగంటి హేమసుందర్, టీడీపీ, జనసేనపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో ప్రజాసంకల్పయాత్రలో బడేటి చంటి ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. తాను విజయం సాధిస్తే నగరంలో సమస్యలు పరిష్కరిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. నగరంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే నాని చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. పార్టీ నగర అధ్యక్షుడు పి.శివప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు ఎన్.కాశీనరేష్,రెడ్డి గౌరీశంకర్, కడియాల విజయలక్ష్మి, కావూరి జిన్నా, లంకపల్లి మాణిక్యాలరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లక్కవరంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంట వెలుగులు నింపనున్నాయన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో అధికార వైసీపీ నుంచి పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వస్తున్నారన్నారు. రాష్ట్రం కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

లక్కవరం గ్రామంలో 8 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశంపార్టీలోకి సొంగా రోషన్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు.

అవల ఏసు, మీసాల దుర్గారావు, అవల దుర్గయ్య, మీసాల వీరాస్వామి, అవలా ఇసాక్, అవల కృష్ణ, మాదాసు వెంకన్న, గుమ్మళ్ళ దుర్గారావు టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, మండవ లక్ష్మణరావు, కొడవటి సత్తిరాజు, కుక్కల మాధవరావు, కొఠారి ప్రసాద్, గద్దె వెంకట సుబ్బారావు, కంభపు రామిరెడ్డి, జనసేన నాయకులు బండారు సురేష్, నాయుడు, దోరేపల్లి మాధవరావు, తూము విజయ్ కుమార్, గిరుజు ఉమా మహేశ్వరి, దండే పద్మ, ఆరుగోల్లు గంగ, సిరిపల్లి పద్మ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ఆరు పథకాలు

పెదవేగి: విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించడానికి అనువుగా పథక రచన చేశారని టీడీపీ నాయకుడు తలకొండ జమలయ్య అన్నారు. బాపిరాజుగూడెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థికి ఓటువేసి, గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జమలయ్య మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలన్నా, మెరుగైన సంక్షేమం కావాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందన్నారు. కూరపాటి ధర్మారావు, చిన్ని సత్యనారాయణ, మట్టా సాయి, అత్తిలి నిరంజన్, గూట్రు సుబ్బారావు, బొప్పన మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయమే లక్ష్యం : పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు: కూటమి విజయమే లక్ష్యంగా మూడు పార్టీలు కలసికట్టుగా ప్రచారం చేస్తున్నామని జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నా రు. కైకరంలో గురువారం జరిగిన ప్రచారంలో గన్ని గోపాలం, చింతల శ్రీనివాస్, శరణాల మాలతీరాణి, సర్పంచ్ సలగాల గోపి, చెన్ను సత్యవాణి, తెలుగు మహిళలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలి : కరాటం

కొయ్యలగూడెం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను గెలిపించుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని యర్రంపేట, గంగన్నగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో చిర్రి బాలరాజుతో కలసి గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల సమస్య ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. జనసేన పార్టీ నాయకులు కరాటం సాయి, దుగ్గిన శ్రీను, తోట రవి, టీడీపీ నాయకులు శ్రీను, రాధాకృష్ణ, భాస్కరరావు, కొడవటి రామకృష్ణ, బీజేపీ నాయకులు, తదతరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలోని రాజానగరం, కేఆర్.పురం, పీఆర్.గూడెం, రవ్వారిగూడెం తదితర గిరిజన గ్రామాల్లో గురువారం జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి అదరణ లభిస్తున్నట్లు బాలరాజు తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : పర్యావరణ విద్య, సంబంధిత అంశాలపై ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్జీసీ) ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్స్ విద్యార్థులకు వర్క్‌షాపు జరిగింది. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డైరెక్టర్, ఈశాన్య రాష్ట్రాల్లో 33 అరుదైన మొక్కల జాతులను కనుగొని పద్మశ్రీ పురస్కారం అందుకున్న డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీఒక్కరిపైన ఉందన్నారు. మూడు దశాబ్దాల క్రితం విద్యుత్ సరఫరా కూడాలేని ఈశాన్య రాష్ట్రాల్లోని మారుమూల గ్రామాల్లో పనిచేసిన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఇంటి పరిసరాల్లో సేంద్రియ ఎరువులతో కూరగాయ మొక్కలను పెంచుకుని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. ఇటీవల ఆహార వృథా ఎక్కువగా ఉందని, దీనిని తగ్గించాలని సూచించారు. పంటల ఉత్పత్తిలో హానికరమైన రసాయనాలు, పురుగుమందులు, ఎరువుల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ కోర్ క్లబ్‌లు ఉమ్మడి జిల్లాలో 500 ప్రభుత్వ హైస్కూళ్ళు, ఏలూరుజిల్లాలో 258 ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పుస్తకాలను అందజేశారు. పర్యావరణహిత మార్పులతోకూడిన జీవనవిధానాన్ని పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్కూల్ హెచ్ఎం సునీత, ఎన్జీసీ డివిజనల్ కోఆర్డినేటర్ మధుసూదనరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకన సిబ్బందికి మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఈవో అబ్రహం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4: అధిక ఉష్ణోగ్రతలు రారెత్తిస్తోన్న నేపథ్యంలో ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో జరుగుతోన్న పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయుల సేదతీర్చేందుకు ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్)జిల్లాశాఖ ముందుకు వచ్చింది. స్పాట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని డీఈవో ఎస్.అబ్రహం గురువారం ప్రారంభించారు. మూల్యాంకన విధులకు హాజరవుతున్న సుమారు 1200 మంది సిబ్బందికి మజ్జిగ పంపిణీచేస్తున్న అపస్ జిల్లా నాయకుల సేవాకార్యక్రమం అభినందనీయమన్నారు. ఇటువంటి స్వచ్ఛంద కార్యక్రమాలు మిగతా ఉపాధ్యాయ సంఘాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మూల్యాంకన జరుగుతున్న గదుల వద్దకే నేరుగా మజ్జిగను తీసుకెళ్ళి టీచర్లకు అందించడానికి ఏర్పాట్లు చేసినట్టు అపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ వివరించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ శ్రీకాంత్, డిప్యూటీ క్యాంపు అధికారి బుధవ్యాస్, అపస్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సతీష్, శ్యాంసుందర్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, మహిళావిభాగం కార్యదర్శి కళ్యాణి పాల్గొన్నారు.

తగాదాలు పరిష్కరించుకోవాలి : రత్న ప్రసాద్



దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో జడ్జిలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4: కుటుంబ వ్యవస్థలో చిన్న చిన్న తగాదాలు రావడం సహజమని, వాటిని పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్, పోక్సో కోర్టు జడ్జి ఉమాసునంద అన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో దిశ వన్ స్టాప్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. అడ్మిన్ నిర్మలను వివరాలు అడిగి సెంటర్ పనితీరు, రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ ఉన్న పలువురు భార్యాభర్తలకు జడ్జిలు స్వయంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కోపతాపాలతో భార్యాభర్తలు విడిపోవడం వల్ల పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. తల్లిదండ్రులు కలిసి ఉంటేనే పిల్లలు సంతోషంగా జీవిస్తారని క్రమ శిక్షణతో పాటు చక్కటి ఆలోచనలతో ఉంటారని అన్నారు. బాధితులకు న్యాయ సహాయం అవసరమైతే ఉచితంగా అందిస్తామని అన్నారు.

రేపు బీజేపీ భారీ కార్ల ర్యాలీ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4: బీజేపీ కార్యకర్తల్లో ఉత్తేజం నింపేందుకు ఈ నెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టిసీమ నుంచి కైకలూరు వరకు భారీ కార్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పోలవరం, చింతలపూడి, దెందులూరు, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో ర్యాలీ నిర్వహించి, ఐదు ప్రాంతాల్లో బీజేపీ జెండా స్థూపాన్ని ఆవిష్కరిస్తామన్నారు. శనివారం బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిషోర్, అంబికా కృష్ణతో పాటు నియోజకవర్గ కన్వీనర్లు, ముఖ్య నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మినారాయణ, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, ఎన్.దానభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన బీజేపీ కూటమికి మద్దతు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికే మద్దతు ఇవ్వాలని కాపు సంక్షేమ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన తొలి స్టీరింగ్ కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా పులి శ్రీరాములు మాట్లాడుతూ సమావేశంలో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రచారం చేయాలని నిర్ణయించారు. క్రమశిక్షణ కలిగిన, కష్టపడి పనిచేస్తున్న వారికి కొత్త కమిటీల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు మోటేపల్లి చంద్రశేఖర్, వాసారాజు, పూజారి నిరంజన్, లింగిశెట్టి శశికుమార్,బడే సతీష్‌నాయుడు, కురెళ్ళ భాస్కర్, పాలేటి భాస్కర్, విశాల శేషగిరి, గుద్దటి రమేష్, కూనిశెట్టి మురళీకృష్ణ, గొడవర్తి నవీన్‌కుమార్, మంచెం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మార్పీఎస్ కృషి

కామవరపుకోట, ఏప్రిల్ 4: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు భారతాల రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు భారతాలవరప్రసాద్, టీడీపీ నాయకులు దర్శినపు ఏసుబాబు, తాడిగడప రమేష్, భారతాల మహేష్, పులపాకుల రమేష్ అన్నారు. వీరిశెట్టిగూడెంలో గురువారం ప్రచారానికి వచ్చిన సొంగా రోషన్ కుమార్‌ను కలుసుకున్నారు. ఆయనతో చర్చల అనంతరం నాయకులు కూటమి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీల పథకాలను రద్దు చేసి జాతికి అన్యాయం చేసిందన్నారు. రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధతకు సహకరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.

కల్యాణ మండపం అద్దెల పెంపు దారుణం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 4: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి కల్యాణ మండప అద్దెలు పెంపు దారుణమని, హిందు ధర్మరక్షాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం వ్యతిరేకించారు. దేవస్థానంకు సంబంధించి కల్యాణ మండపాలు, అద్దెరేట్లు వ్యాపార దృక్పదంతో పెంచటం సరికాదన్నారు. ఆలయం దరిదాపుల్లో కొన్ని మైళ్ళవరకు ఒక ఏలూరు తప్ప పెద్ద పట్టణం లేదన్నారు. ద్వారకా తిరుమల చుట్టూ వ్యవసాయంపై బ్రతికే సామాన్య ప్రజలు, వ్యవసాయ రైతులు, కూలీలు ఉన్నారన్నారు. ఎక్కువ వివాహాలు ద్వారకా తిరుమల కల్యాణ మండపంలో జరుగుతూ ఉంటాయని, సామాన్య భక్తులకు అందుబాటులో లేకుండా వ్యాపార సరళితో అద్దెరేట్లు పెంచడం అన్యాయం అన్నారు. అదే రేట్లు పెంపు వ్యవహారాన్ని పునరాలోచించుకోవాలని ఆయన సూచించారు.

వేసవిపై అప్రమత్తంగా ఉండండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణకిషోర్

లింగపాలెం, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ సూచించారు. ముడిచర్లలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎక్కువ సమయం ఎండలో తిరగవద్దని తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో తిరగాల్సివస్తే చున్ని, టోపీ కాని పెట్టుకుని వెళ్ళాలని, వేడిగాలుల తీవ్రత కళ్లకు తగలకుండా కళ్లజోడు వాడాలన్నారు. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ లాంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. కనీసం 15 గ్లాసుల నీరు అయినా తాగాలన్నారు. మాంసాహారం తగ్గించాలని, కూల్‌డ్రింక్స్ తాగవద్దన్నారు. పలువురు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వి రోజా, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొక్కిరపాడులో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం



దొరమామిడిలో ప్రత్యేక పోలీసు బలగాల కవాతు

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెదపాడు, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఓటరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించేలా తగిన రక్షణ చర్యలు చేపడతామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. పెదవేగి సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో పోలీసు, రిజర్వుడు పోలీసు సిబ్బంది గురువారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు, ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు, అధికారులు చర్యలు చేపడతారని, వారికి తగినవిధంగా సహకరించాలన్నారు. ఘర్షణలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, 144 సెక్షన్ అమల్లో వున్న నేపథ్యంలో సభలు, ర్యాలీలు నిర్వహించే ముందు అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో పెదపాడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోడానికి భరోసా కల్పిస్తూ ఏజెన్సీ ప్రాంతంలో సాయుధ దళాలు కవాతు నిర్వహించారు. ఎస్సై కె.వెంకన్న దొరమామిడి, కోయఅంకంపాలెం గిరిజన గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్సై సూచించారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

ఎస్పీ మేరీ ప్రశాంతి



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4: రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన, రెచ్చగొట్టేలా ప్రయత్నించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ బూత్‌లు, సమస్యలు, గత ఎన్నికల బైండోవర్, ప్రస్తుతం నమోదు చేసిన కేసులపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉద్రిక్తతలకు దారి తీయకుండా ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలన్నారు. చట్టవిరుద్ధమైన చర్యలు జరుగుతున్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియా పోస్టింగ్‌ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. చట్టవ్యతిరేక పోస్టుపెట్టిన, ఫార్వర్డ్ చేసిన వారిదే బాధ్యతన్నారు. కులాన్ని, మతాన్ని ఎవరి మనోభావాలు దెబ్బతీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా అందరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఎస్పీతో డీఎస్పీ రవిచంద్ర, సీఐ రాజేష్, ఎస్ఐలు ఉన్నారు.

కామవరపుకోటలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

కామవరపుకోట, ఏప్రిల్ 4: ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట హైస్కూల్ వద్ద పోలింగ్ కేంద్రాలను గురువారం రాత్రి ఎస్పీ మేరీప్రశాంతి పరిశీలించారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రవద్ద కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద భద్రతను పెంచాలన్నారు. సాయుధ బలగాలను మోహరించాలని కవాతు నిర్వహించాలని ఎస్పీ సూచించారు డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పిరాజేష్, ఎస్ఐ జయబాబు ఉన్నారు.

ఈవీఎంలపై సెక్టార్ అధికారులకు శిక్షణ

చింతలపూడి, ఏప్రిల్ 4: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈవీఎంల నిర్వహణపై రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య సెక్టార్ అధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం ఎలా ఉపయోగించాలి, బ్యాలెట్ పేపర్ ఏవిధంగా పెట్టాలి, పోలింగ్ కేంద్రానికి తరలింపు, సీల్ చేయడంపై అవగాహన కల్పించారు. సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ కూడా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎలక్టోరల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై హెచ్‌ఎంలకు సూచనలు

భీమడోలు, ఏప్రిల్ 4: మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల వనరుల కేంద్రంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై వారికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసరావు, కుమార్ పాల్గొని నాడు నేడు పూర్తి సమాచారంను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై చర్చించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ప్రశ్నాపత్రాలను కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4: జంగారెడ్డిగూడెం 132కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణగంగా కొన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాధాకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెం టౌన్ సబ్ స్టేషన్‌లు, తాడువాయి సెక్షన్ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లు, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో అన్ని సబ్ స్టేషన్‌ల పరిధిలో అన్నీ గ్రామాలకు శుక్రవారం సాయంత్రం 4 గంటలనుంచి 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

నారాయణపురంలో..

ఉంగుటూరు, ఏప్రిల్ 4: నారాయణపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో వేసవి మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం కలగనుంది. చెట్లను తొలగించడం కోసం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఆపరేషన్స్ బి.శ్రీరాం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదంలో బాధితులకు చింతమనేని సాయం

పెదపాడు, ఏప్రిల్ 4: జాతీయరహదారిపై ప్రమాదంలో బాధితులను ఆసుపత్రికి తరలించడంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహాయక చర్యలు చేపట్టారు. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన సుగ్గసాని గంగయ్య ప్రయాణిస్తున్న కారు, మరో కారు జాతీయ రహదారిపై తాళ్లమూడి వద్ద గురువారం ఉదయం ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. అదే సమయంలో దుగ్గిరాల వస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని సంఘటనాస్థలం వద్ద ఆగి పరిస్థితిని సమీక్షించి, క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు.

ఉషా పిక్చర్స్ 50 వసంతాల సందడి



బాల కృష్ణారావును అభినందిస్తున్న సిబ్బంది

ఉషా పిక్చర్స్ సంస్థ ఏర్పాటుచేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా చైర్మన్ వీవీ.బాలకృష్ణారావును గురువారం సిబ్బంది సత్కరించారు. మేనేజర్ డి.సురేష్‌కుమార్, క్యాషియర్ మారెళ్ల సత్యనారాయణ, అక్కౌంటెంట్లు టి.రమణబాబు, కె.కోటేశ్వరరావు, ఉషా గ్రూపుల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి


కాత్రేనిపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వాసు

ముసునూరు, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ పి.వాసు కోరారు. గురువారం కాత్రేనిపాడులో ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాల న్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. రాజకీయ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను ప్రలోభపెట్టేలా ప్రయత్నాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకుని సమర్థవంతమైన పాలకులను ఎన్నికోవాలన్నారు. ఏఎస్‌ఐ నాగభూషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ పాట్లు..

ఎండలో వృద్ధులకు తప్పని ఇబ్బందులు

ముదినేపల్లి, ఏప్రిల్ 4:గ్రామ సచివాలయాలతోపాటు పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం ముదినేపల్లి మండలంలో పెన్షన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. పెన్షన్ల పంపిణీ గ్రామ సచివాలయాల వద్దే బుధవారం చేపట్టగా, ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న ఇతర పంచాయతీలు శివారు గ్రామాల పెన్షనర్లకు వారి నివాస ప్రాంతాల్లోనే సచివాలయాల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయాలకు దూరంలో ఉన్న పలు గ్రామాల నుంచి పెన్షనర్లు మండుటెండలో రావడం ఇబ్బందిగా ఉండడంతో స్థానికంగానే పంపిణీ చేపట్టినట్టు ఎంపీడీవో మురళీ గంగాధరరావు తెలిపారు. గురువారం మండలంలో 79 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్టు తెలిపారు. రెండోరోజు గురువారం పలువురు వృద్ధులు పెన్షన్ తీసుకునేం దుకు మండుటెండలో పెన్షన్ తీసుకునేందుకు వృద్ధులు హడావుడిగా రావడం కనిపించింది.

గ్రామస్థులతో ముద్దరబోయిన ఆత్మీయ కలయిక


పల్లెర్లమూడిలో స్థానికులతో ముద్దరబోయిన

నూజివీడు, ఏప్రిల్ 4: చరిత్రను తిరగరాసేందుకు అభిమానులు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మర్రిబంధం, పల్లెర్లమూడి, ఎంఎన్‌పాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. పల్లెర్లమూడి గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ 2004లో గన్నవరం నుంచి విజయం సాధించానని, అప్పుడు కాంగ్రెస్‌పార్టీ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గాలిలో కూడా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచానన్నారు. నూజివీడులో ఇరవై ఏళ్ల అనంతరం అది పునరావృతం కానున్నదన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా, పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను గెలిచిన ఏడాదిలోపే పూర్తి చేస్తానన్నారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత


పెండ్లి కుమారుడుకి బంగారు నాణెం అందజేస్తున్న నాయకులు

చాట్రాయి, ఏప్రిల్ 4: చాట్రాయి పాల సహకార సంఘం సభ్యుడు ఓరుగంటి శివనాగరాజు వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ.20వేలు విలువైన బంగారు నాణేన్ని గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. కార్యక్రమంలో తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షుడు కుప్పిరెడ్డి వసంతరెడ్డి పాడి రైతులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని జయదుర్గ ఎంపిక



కలిదిండి, ఏప్రిల్ 4 : గుర్వాయిపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న పోసిన జయదుర్గ నవోదయకు ఎంపికైందని హెచ్‌ఎం బస్వారావు తెలిపారు. గుర్వాయి పాలెం గ్రామానికి చెందిన బాలికకు ఎంఈవో ప్రభాకర్ బాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాలి బూడిదైన రూ.3.60 లక్షల నగదు, ఐదు కాసుల బంగారం


తుమ్మగూడెంలో దగ్ధమైన ఇంటిలో బాధితులు

చాట్రాయి, ఏప్రిల్4: చాట్రాయి మండలం తుమ్మగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి షేక్ మెహబూబ్‌అలీకి చెందిన రేకుల షెడ్ దగ్ధమైంది. రూ.3.60 లక్షల నగదు, 5 కాసుల బంగారం ఇంటి సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

క్రైం కార్నర్

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి అరెస్టు


తుపాకీ గల వ్యక్తిని చూపుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

కైకలూరు, ఏప్రిల్ 4: నాటు తుపాకీ కలిగిన వ్యక్తిని అరెస్టు చేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నామని కైకలూరు రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం శీతనపల్లిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెల్లూరు జిల్లా సింగవరం గ్రామానికి చెందిన ఎస్.విజయన్ వద్ద తుపాకీలు ఉన్నాయని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పిన లారీ.. తప్పిన పెనుప్రమాదం


డెయిరీ అవుట్‌లెట్‌లోకి వెళ్లిన లారీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4: లారీ అదుపుతప్పి రోడ్డుపక్కన వున్న మోడల్ డెయిరీ అవుట్‌లెట్‌లోకి దూసుకుపోవడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావుకాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన లారీ అదుపుతప్పి మోడల్ డెయిరీ అవుట్‌లెట్‌లోకి దూసుకువెళ్ళింది. వరంగల్ నుంచి హనుమాన్‌జంక్షన్‌కు మొక్కజొన్న లోడుతో వెళుతున్న లారీ కాలనీ క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి మోడల్ డెయిరీ అవుట్‌లెట్‌లోకి దూసుకువెళ్ళింది. రెండు మోటారు సైకిళ్లు ధ్వంసం అయ్యాయి. స్థానికులు లారీ రావడం చూసి పక్కనే ఉన్న పొలాల్లోకి పరిగెత్తడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డెయిరీ అవుట్‌లెట్ షెడ్డు ధ్వంసమైంది.

నాటు సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ముసునూరు, ఏప్రిల్ 4: నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని ముసునూరు పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన వడిత్య స్వామినాయుడు అనే వ్యక్తి లోపూడి గ్రామానికి సారా తరలిస్తున్న క్రమంలో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు. దాడిలో మూడు లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


ముదినేపల్లి మండలం పేరూరు, బొమ్మినంపాడు, పెయ్యేరు గ్రామాల చెరువుల్లో తగ్గిన నీరు

అడుగంటిన చెరువులు

రంగుమారి వెదజల్లుతున్న దుర్వాసన

తాగునీటి సమస్యతో పాటు సాధారణ వినియోగానికి కరువు


మూల్లంక, భాస్కరరావుపేట గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులు

ముదినేపల్లి, ఏప్రిల్ 4 : ముదినేపల్లి మండలంలోని మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటింది. చాలా గ్రామాల్లో చెరువుల్లో నీరు రంగు మారి దుర్వాసన వస్తున్నాయి. చెరువుల్లో నీరు తగ్గిపోవడంతో పలు గ్రామాల్లో నీటి పథకాల ద్వారా రెండు, మూడు రోజులకొకసారి నీరు వదులుతున్నారు. తాగునీటి సమస్యతోపాటు నిత్యం సాధారణ వినియోగానికి నీరు కరువైంది. పశువుల చెరువుల్లో నీరు తగ్గిపోవడంతో మూగజీవాలు రంగుమారిన నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. బొమ్మినంపాడు, పేరూరు, ములకలపల్లి, పెయ్యేరు, కాకరవాడ, సింగరాయిపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఉన్న నీటి నిల్వలు తక్కువస్థాయిలో ఉన్నాయి. చెరువుల్లో నీరు నింపే వరకు సరిపోతాయా లేదా అనే ఆందోళన కలిగిస్తున్నాయి. కాల్వల ద్వారా నీరు ముదినేపల్లి మండలానికి చేరేటప్పటికీ కనీసం ఇంకో వారం రోజుల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు చెరువుల్లోకి నీటిని వంతులవారీగా విడుదల చేయడంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే పేరూరు గ్రామస్థులు దాకరం వెళ్లి అక్కడి చెరువు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. మండలంలోని శివారు గ్రామాల్లో చెరువులను నింపడంలో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉప్పుటేరు తీర గ్రామాల్లో..

కలిదిండి, ఏప్రిల్ 4 : ఉప్పుటేరు తీర గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటడంతో తాగునీటి కోసం ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. పెదలంకలో తాగునీటి చెరువుపూర్తిగా అడుగంటడంతో నీరు రంగుమారి కలుషితమైంది. ఆ నీరు వాడుకునేందుకు ఇబ్బందికరంగా ఉంది. మూల్లంక, భాస్కరావుపేట గ్రామాల చెరువులు అడుగంటాయి. రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నారు. నీటిరంగు మారడంతో తాగటానికి ఆమోద యోగ్యం లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లో తాగునీరును కొనుగోలు చేస్తున్నారు. సంతోషపురంలో తాగునీటి చెరువు అడుగంటింది. త్వరితగతిన చెరువులు నింపేందుకు తాగునీటి వంతు ఇస్తే గ్రామస్థుల సహకారంతో చెరువులను నింపుకుంటామని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఫిబ్రవరిలో తాగునీటి వంతు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో తాగునీటి చెరువులను సక్రమంగా నింపలేక పోయామని ఈసారైన తాగునీటి వంతు సక్రమంగా ఇస్తే చెరువులను పూర్తిస్థాయలో నింపుతామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


మూల్లంక చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ వంశీ

కలిదిండి, ఏప్రిల్ 4 : శివారు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. గురువారం సంతోషపురం, భాస్కరావుపేట గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉప్పుటేరు తీర ప్రాంతంలో ఉన్న పెదలంక తాగునీటి చెరువు పూర్తిగా అడుగంటిన కాల్వలకు తాగునీరు విడుదల చేయగానే అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు. మూల్లంక, భాస్కరావుపేట, సంతోషపురం గ్రామాల్లో చెరువులు అడుగంటాయని వీటిని పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజుల్లో సీబీ కెనాల్‌కు తాగునీరు చేరుతుందన్నారు. తాగునీటి కోసమే విడుదల చేస్తున్న ఈ నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


తామరకొల్లు, పులపర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు, పెదపుట్లపూడిలో కరపత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బాబు

కైకలూరు, ఏప్రిల్ 4:టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీకి ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు అన్నారు. గురువారం కైకలూరు మండలంలోని దానగూడెం, తామరకొల్లు గ్రామాల్లో కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఇంటింటికి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రాజెక్టులు, పరిశ్రమలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపిం చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రచార కార్యక్రమాల్లో కైకలూరు మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు, తామరకొల్లు ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకటనరసమ్మ, మాజీ ఎంపీటీసీలు తెంటు వెంకటరమణ, గంగుల శ్రీదేవి, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, మైగాపుల రామాంజనేయులు, పుప్పాల సూర్యప్రకాశరావు, టీడీపీ నాయకులు లక్కింశెట్టి మోహన్, గంగుల ఏసురాజు, వీరాబత్తిన సుధా, కుర్మా నవీన్, మోదుగుముడి అశోక్, కళాదర్ సురేంద్ర, విల్సన్, మాదపాటి నాగరాజు, గంగుల పోతురాజు, జనసేన మహిళలు పాల్గొన్నారు.

పులపర్రులో టీడీపీ ఇంటింటా ప్రచారం

మండవల్లి, ఏప్రిల్ 4: పులపర్రు గ్రామంలో టీడీపీ శ్రేణులు గురువారం సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ వారిరువురికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సజ్జ బాబి, అట్లూరి భవాని ప్రసాద్, గజ్జల గణేష్, మోరు రవీంద్ర, గాలి ప్రసాదు, నాగనబోయిన పవన్‌కుమార్, గణేష్, తలారి రాజేష్, వీరవల్లి శివయ్య ఘంటసాల తులసి, ముంగర ఏసురాజు, కాట్రగడ్డ శంకరరావు, పులపర్రు గ్రామపెద్దలు, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి సభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి కామినేనికి మద్దతుగా ప్రచారం

కలిదిండి, ఏప్రిల్ 4 :కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు మద్దతుగా గురువారం కలిదిండి మండలంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు తొమ్మిది టీములుగా ఏర్పడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.

టీడీపీ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి


లోపూడిలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, ఏప్రిల్ 4: టీడీపీ ప్రభుత్వ పాలనలోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం లోపూడిలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. వైసీపీ ఐదేళ్లపాలనలో సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయలను దోచుకోవడంతోపాటు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి నాశనం చేసిందని విమర్శించారు. సంపద సృష్టించగల సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందని, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథిని గెలుపించుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో 69వ బూత్ ఇన్‌చార్జి కాటేపల్లి కేశవరావు, నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నారావు, డోలా రాంబాబు, పంజుగల వెంకయ్య, పేరం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి

నూజివీడు అసెంబ్లీ కూటమి అభ్యర్థి పార్థసారథి


పింఛన్లను ఇళ్లకే పంపిణీ చేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పార్థసారథి

చాట్రాయి, ఏప్రిల్ 4: పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని, వృద్ధులు, దివ్యాంగులకు ఎండలో ఇబ్బందులకు గురి చేయ వద్దని నూజివీడు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం చాట్రాయి ఎంపీడీవో మంగాకుమారిని టీడీపీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పింఛన్లకు విడుదల చేయాల్సిన నిధులను పక్కదారికి మళ్ళించి డబ్బులు లేక పోవడంతో నాటకాలు ఆడుతుందని విమర్శించారు. తన అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి టీడీపీపై బురదచల్లి రాజకీయం లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గం అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం వలంటీర్లను నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుంచి తప్పించాలని సూచించిందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణీ చేసేందుకు అవకాశాలు ఉన్నప్పటికి లబ్ధిదారులను అవస్థలు పాలు చేయడం దారుణం అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయకపోతే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం మండలంలో తాగునీటి ఎద్దడిపై ఎంపీడీవోతో సమావేశమయ్యారు. నీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు చేట్టాలని డిమాండ్ చేశారు.

నరశింహారావుపాలెంలో ఆత్మీయ సమావేశం

నరశింహారావుపాలెంలో గురువారం కూటమి అభ్యర్థి పార్థసారథి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో పలు సమస్యలు స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పోలవరంలో టీడీపీ సీనియర్ నాయకులు చాగంటి నరశింహారావు, బుచ్చిబాబు తల్లి అనసూయ మృతి చెందగా పార్థివదేహానికి ఆయన నివాళులు అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు బసవారెడ్డి, మొరంపూడి శ్రీనివాసరావు, నోబుల్‌రెడ్డి, తల్లాడ శ్రీను, మారేష్, మరిడి చిట్టిబాబు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

'పెన్షన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి'


కైకలూరు టీడీపీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కైకలూరు, ఏప్రిల్ 4: రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో తెలుగుదేశం వల్లే లబ్ధిదారుల ఇళ్లకు పెన్షన్ రావడం లేదని వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని గ్రామస్థాయిలో తిప్పికొట్టాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు అన్నారు. గురువారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకే పనిచేయాల్సి ఉంటుందని టీడీపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కష్టపడి పనిచేసిన ప్రతీ ఒక్కరికి పార్టీ అధిష్ఠానం గుర్తింపు ఇస్తుందని ఎలాంటి అపోహలకు తావులేకుండా చంద్రబాబు సూచించిన వ్యక్తి కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలోనూ కైకలూరులోనూ వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని పలువురు నేతలు పేర్కొన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబుకు టీడీపీలో సముచిత స్థానం కల్పించాలని నాయకులు, కార్యకర్తలు మాట్లాడారు. ఈ విషయాన్ని చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లాలని సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో పార్టీల మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, నారగాని నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాష్ట్ర పార్టీ నాయకులు పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, చలసాని జగన్మోహనరావు, కొత్తూరి విఠల్, పట్టణ పార్టీ అధ్యక్షుడ ఎండీ జానీ, తెలుగు మహిళా నాయకురాలు పి.లక్ష్మీరాణి, తెంటు వెంకటరమణ, గంగుల శ్రీదేవి, తామరకొల్లు ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాండవుల విగ్రహాల ప్రతిష్ఠ


పాండవులను దర్శించుకుంటున్న ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, నితిన్‌కృష్ణ

ముసునూరు, ఏప్రిల్ 4: గుడిపాడు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పంచ పాండవుల విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి కుమారుడు కొలుసు నితిన్‌కృష్ణ పాండవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన కాలం నాటి నుంచి ఇక్కడ చిన్న ఆలయంలో పాండవుల ఆకారాలతో విగ్రహాలు ఉండేవని, వాటికి పూజల చేస్తున్నామని గ్రామస్థుల సహకారంతో నూతన ఆలయం కట్టి, విగ్రహాలు ప్రతిష్ఠించామని ఎస్సీ కాలనీ పెద్దలు వివరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గుడిపాడు, గుళ్ళపూడి గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4: మీర్జాపురంలో అంకమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి పార్థసారథి కుమారుడు నితిన్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

బస్ సౌకర్యం కల్పించండి

జిల్లాల విభజన జరిగి రెండేళ్లు పూర్తి

ఏలూరు వచ్చేందుకు ముదినేపల్లి మండల వాసుల పాట్లు



ముదినేపల్లి, ఏప్రిల్ 4 : కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు గడిచినా ముదినేపల్లి మండలం నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పడలేదు. గురువారం నాటికి జిల్లాల పునర్విభజన జరిగి సరిగ్గా రెండేళ్లు. 2022 ఏప్రిల్ 4న కొత్త జిల్లాలు ఏర్పడగా, ఏలూరు లోక్‌సభ పరిధిలో ఉన్న కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం కృష్ణాజిల్లా నుంచి విడిపోయి ఏలూరు జిల్లాలో కలిసింది. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంకు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం ఉండేది. ఇప్పటికీ ఆ సౌకర్యం కొనసాగుతూనే ఉంది. కొత్త జిల్లా కేంద్రమైన ఏలూరుకు ఆర్టీసీ అధికారులు ముదినేపల్లి నుంచి సరాసరి బస్ సౌకర్యం కల్పించలేదు. అప్పటి నుంచి బస్ సర్వీస్ కోసం ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారులను కలసి కోరినా నేటికీ ఫలితం లేదు. ముదినేపల్లి నుంచి ఏలూరుకు సరాసరి బస్ సౌకర్యం లేక మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలు గుడివాడ,కైకలూరు మీదుగా చుట్టూ తిరిగి బస్సులు మారుతూ వెళ్లాల్సి వస్తుంది. ఏలూరు నుంచి కైకలూరు, మండవల్లి మీదుగా ముదినేపల్లికి బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నూజివీడు టీడీపీ కార్యాలయం వద్ద హడావుడి

ప్రహరీకున్న పార్టీ బ్యానర్లు తొలగించేందుకు అధికారుల ప్రయత్నం

నూజివీడు, ఏప్రిల్ 4: నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయంటూ కార్యాలయపు ప్రహరీకి ఏర్పాటుచేసిన బ్యానర్లను తొలగించే ప్రయత్నం రెవిన్యూ అధికారులు గురువారం రాత్రి 7 గంటలకు చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు హడావుడి జరిగింది. రెవెన్యూ, పోలీస్ అధికారులతో టీడీపీ కార్యకర్తలు తమకు అనుమతిపత్రాలు ఉన్నాయంటూ చూపారు. ఈ సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీవో, ఆర్వో వై.భవానీశంకరి ఘటనా స్థలానికి చేరుకుని టీడీపీ కార్యకర్తలకు ఎన్నికల నిబంధనలను వివరించి సర్దుబాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతికి మించి ఏర్పాటు చేసిన బోర్డులను వెంటనే తొలగించి, శనివారం ఉదయంలోగా బోర్డును కార్యాలయం వద్ద ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ నాయకులకు స్పష్టం చేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి : ఆర్డీవో

రాజకీయపార్టీలు సభలు, సమావేశాలకు, ప్రచారాలకు, ప్రచార బోర్డులకు సైతం అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని ఆర్డీవో వై.భవానిశంకరి స్పష్టం చేశారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సువిధా యాప్ ద్వారా రెండురోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద ఆదేశాలు లేకుండా బ్యానర్లను తొలగించేందుకు ప్రయత్నించిన వీఆర్వోకు నోటీస్ జారీచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఏ రాజకీయపార్టీ అయినా తమ కార్యాలయం వద్ద ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక బోర్డును మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. మిగతా బోర్డులు ఏర్పాటు చేయాలనుకుంటే విడిగా సదరు స్థల యజమానుల నుంచి అనుమతి పత్రాలు తీసుకుని ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

అచ్చెన్నాయుడుకి ముదినేపల్లి నేతల పరామర్శ


అచ్చెన్నాయుడుని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు నాగేంద్రకుమార్, నాగరాజు

ముదినేపల్లి, ఏప్రిల్ 4 : మాతృమూర్తిని కోల్పోయిన ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడును గురువారం ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు పరామర్శించారు. అచ్చెన్నాయుడు స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా నెమ్మాడలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కలసి పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారని తెలిపారు.